
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
మంగళవారం ၊ 13 ၊ ఫిబ్రవరి ၊ 2024



సోమశిలలో 22.205 టీఎంసీలు

సోమశిల: జలాశయంలో సోమవారం సాయంత్రానికి 22.205 టీఎంసీల నీరు నిల్వ ఉంది. వివిధ కాలువలకు 3,450 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు.



బంగారం ధరలు

24 క్యారెట్లు (10గ్రాములు)	రూ.64,240
22 క్యారెట్లు ఆర్నమెంట్ (1గ్రా)	రూ.5,769
3శాతం జీఎస్టీతో	రూ.5,942
నవర (8గ్రా)	రూ.47,536

గరిష్టం/కనిష్టం
32.5 /23.2

వాతావరణం

సోమవారం గాలిలో తేమ 64 శాతం ఉంది. ఉష్ణోగ్రతలు సాధారణ స్థితికి చేరుకున్నాయి. మంగళవారం పెద్దగా మార్పులు ఉండబోవని వాతావరణశాఖ తెలిపింది.

న్యూస్‌రీల్

సమన్వయంతో పనిచేయండి



సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్సీ

నెల్లూరు(టౌన్): జిల్లాలో పార్టీ విజయం కోసం అందరూ సమన్వయంతో పనిచేయాలని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సూచించినట్లు ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. సోమవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా పలు విషయాలపై చర్చించినట్లు తెలిపారు. ప్రభుత్వం అన్నివర్గాల వారికి అందించిన సేవలను ప్రజలకు వివరించాలని సీఎం సూచించారని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలని ముఖ్యమంత్రి తెలిపారన్నారు.

ఇక్కడి పరిశోధనలు ప్రశంసనీయం



నెల్లూరులోని పరిశోధనా స్థానాన్ని పరిశీలిస్తున్న బోర్డు సభ్యులు

నెల్లూరు(సెంట్రల్): నెల్లూరులోని ఆచార్య ఎన్‌జీ రంగా వ్యవసాయ పరిశోధనా స్థానంలో చేస్తున్న కొత్త వంగడాల పరిశోధనలు ఎంతో బాగున్నాయని ఆ విశ్వవిద్యాలయం బోర్డు సభ్యులు ప్రశంసించారు. నెల్లూరులోని పరిశోధనా స్థానం, కృషి విజ్ఞాన కేంద్రం, తోటపల్లి గూడూరులోని విత్తనోత్పత్తి ప్రాంతం, పొదలకూరులోని వ్యవసాయ పరిశోధనా స్థానంలను బోర్డు సభ్యులు మల్లికార్జునరెడ్డి, శ్రీనివాసులు రెడ్డి, కృష్ణారెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ప్రాంతం నుంచి వచ్చే కొత్త వంగడాలు ఎంతో ప్రసిద్ధి పొందుతున్నాయని తెలిపారు. మరిన్ని కొత్త వంగడాలను సృష్టించాలని ఆకాంక్షించారు. ముఖ్యంగా తెగుళ్లను తట్టుకుని, రైతులకు ఎక్కువ దిగుబడినిచ్చే వంగడాలను తయారు చేస్తున్న శాస్త్రవేత్తలకు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

నేడు జెడ్పీ అత్యవసర సర్వసభ్య సమావేశం

నెల్లూరు(పొగతోట): నగరంలోని జెడ్పీ సమావేశ మందిరంలో జిల్లా పరిషత్ అత్యవసర సర్వసభ్య సమావేశం మంగళవారం నిర్వహించనున్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు ఈ సమావేశం జరగనుంది. జిల్లా పరిషత్ సభ్యులు, వివిధ శాఖల జిల్లా అధికారులు తప్పనిసరిగా హాజరుకావాలని జెడ్పీ సీఈఓ కన్నమనాయుడు సోమవారం తెలిపారు.

నేడు జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శన



ఏర్పాట్లను పరిశీలిస్తున్న డిప్యూటీ ఈఓలు

నెల్లూరు(టౌన్): జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను స్థానిక పొదలకూరు రోడ్డులోని జిల్లా పరిషత్ బాలుర హైస్కూల్‌లో మంగళవారం నిర్వహించనున్నారు. వైజ్ఞానిక ప్రదర్శనకు సంబంధించి అన్ని ఏర్పాట్లను డిప్యూటీ ఈఓలు లక్ష్మీ ప్రసన్న, రఘునాథ్, శ్రీనివాసులు పర్యవేక్షిస్తున్నారు. వైజ్ఞానిక ప్రదర్శన ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జెడ్పీ చైర్‌పర్సన్ ఆనం అరుణమ్మ, ఎమ్మెల్సీ పి.చంద్రశేఖర్‌రెడ్డి, మేయర్ స్రవంతి తదితరులు హాజరుకానున్నారు. ఎంపికైన ప్రాజెక్టులకు సంబంధించి విద్యార్థులు, గైడ్ టీచర్లు ఉదయం 7 గంటలకు జెడ్పీ బాలుర హైస్కూల్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసులు తెలిపారు.

ప్రాక్టికల్స్‌కు 238 మంది గైర్హాజరు

నెల్లూరు(టౌన్): ఇంటర్ ప్రాక్టికల్స్‌కు సోమవారం జిల్లావ్యాప్తంగా రెండు విడతల్లో మొత్తం 238 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. ఉదయం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 5,123 మంది హాజరుకావాల్సి ఉండగా, 4,976 మంది హాజరయ్యారు. 147 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. మధ్యాహ్నం జరిగిన ప్రాక్టికల్స్ పరీక్షలకు 4,536 మంది హాజరుకావాల్సి ఉండగా, 4,445 మంది హాజరయ్యారు. 91 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు.

సంక్షేమ రాజ్యం

ప్రజల ఇంటి ముంగిటకే పథకాలు అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం

- గత టీడీపీ ప్రభుత్వ పాలనకు భిన్నంగా సీఎం వైఎస్ జగన్ పాలన
- దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా విస్తృతంగా పథకాల అమలు
- ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన జగనన్న
- సంతోషం వ్యక్తం చేస్తున్న ప్రజలు

రెక్కాడితే గానీ డొక్కాడని బతుకులు. పనికెళితే గానీ పూట గడవని జీవితాలు. ఇలాంటి వారి జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎలాంటి ప్రయత్నం చేయలేదు. 2019లో అధికారంలోకి వచ్చిన వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అందుకు భిన్నంగా రాష్ట్రంలోని పేదలను ఆర్థికంగా ఆదుకునేందుకు వివిధ సంక్షేమ పథకాలను పారదర్శకంగా అమలు చేస్తోంది. సంక్షేమ పథకాల ప్రయోజనాన్ని డీబీటీ ద్వారా లబ్ధిదారుల ఖాతాల్లోనే జమ చేస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తోంది. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలను చేరువ చేసి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు.

ఉదయగిరి: గత టీడీపీ ప్రభుత్వంలో సంక్షేమ పథకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, చిన్న సర్టిఫికెట్ కోసమైనా ప్రజలు నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు ఆ తిప్పలు తప్పాయి. సంక్షేమ పథకాలు పొందేందుకు ఎవరినీ ప్రాధేయపడాల్సిన అవసరం లేదు. అధికారులు, నేతల సిఫార్సులు అంతకన్నా అవసరం లేదు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హతే ప్రామాణికంగా ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ఇంటి ముంగిటకే చేరువ చేశారు. పేదరిక నిర్మూలనే ధ్యేయంగా, జీవన ప్రమాణాలు పెంపొందించడమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు పారదర్శకంగా ప్రజలకు అందుతున్నాయి.

ఇంటి వద్దకే 11 రకాల సర్టిఫికెట్లు

గత టీడీపీ ప్రభుత్వంలో కుల, ఆదాయ, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్లు, రేషన్‌కార్డులు, ఆరోగ్యశ్రీ కార్డులు కావాలంటే నెలల తరబడి ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. అధికారులకు లంచం యథాతథం. అయితే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక సచివాలయ, వలంటీర్ వ్యవస్థలను ఏర్పాటు చేసి ప్రజలకు అత్యంత ముఖ్యమైన 11 రకాల సర్టిఫికెట్లను వారి ఇంటి ముంగిటకే అందిస్తోంది. ఈ కార్యక్రమంలో సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, రెవెన్యూ అధికారులు అర్జీలు స్వీకరించి వారికి అవసరమైన ధ్రువీకరణ పత్రాలను అందిస్తున్నారు. జిల్లాలో ఇప్పటి వరకు 4.5 లక్షలకు పైగా ధ్రువీకరణ పత్రాలను ప్రజలకు అందజేశారు.





జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరంలో పరీక్షలు చేసి ఉచితంగా మందులు అందజేస్తున్న వైద్యసిబ్బంది, నాయకులు (ఫైల్)

పోషణ బాధ్యత

టీడీపీ హయాంలో మాతా శిశు మరణాలు ఎక్కువగా ఉండేవి. పేరుకు అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్నా కనీస వసతులు ఉండేవి కావు. పౌష్టికాహారం సక్రమంగా అందేది కాదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత చిన్నారులు, బాలింతలు, గర్భిణుల్లో పోషకాహార లోపం నివారించేందుకు వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకాన్ని అమలు చేస్తోంది. ఈ పథకం ద్వారా గుడ్లు, చిక్కీలు, పాలు, బాలామృతం, రేషన్, పప్పులు, నూనె, ఇతర ఆహార పదార్థాలు ఇంటి వద్దకే అందిస్తోంది. తద్వారా జిల్లాలో సుమారు 30 వేల మంది లబ్ధిదారులు ప్రయోజనం పొందుతున్నారు.

హామీలన్నీ నెరవేర్చి..

టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు 2014 ఎన్నికల సమయంలో ప్రజలకు 600 హామీలిచ్చి ఒక్కటి కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకుండా మోసం చేశారు. చివరకు టీడీపీ వెబ్‌సైట్‌లోనే ఆ హామీలను తొలగించారు. 2019 ఎన్నికల్లోనూ చంద్రబాబు మాటలను నమ్మని ప్రజలు టీడీపీని ప్రతిపక్షంలో కూర్చోబెట్టారు. ప్రస్తుతం మళ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో హామీల వర్షం కురిపిస్తున్నారు. మోసపూరిత హామీలతో ప్రజలను మభ్యపెట్టేందుకు ప్రయత్నిస్తున్నారు. కాగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మాత్రం 2019 ఎన్నికల సమయంలో ప్రజలకిచ్చిన హామీల్లో 99.8 శాతం నెరవేర్చి ప్రజాభిమానాన్ని చూరగొన్నారు. ప్రభుత్వ పథకాలను ప్రజల ఇంటి ముంగిటకే అందిస్తూ రికార్డు సృష్టిస్తున్నారు.

ఇంటి వద్దకే రేషన్



టీడీపీ హయాంలో పౌరసరఫరా శాఖ ద్వారా సరఫరా చేస్తున్న రేషన్ బియ్యం, సరుకులు పక్కదారి పట్టి పేదలకు అందేవి కావు. డీలర్లు, మధ్యవర్తులు కుమ్మక్కై అమ్ముకొని సొమ్ము చేసుకునేవారు. సీఎంగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక పేదలకు నాణ్యమైన బియ్యం, చక్కెర, ఇతర సరుకులు ఎండీయూ వాహనాల ద్వారా కార్డుదారుల ఇంటి వద్దకే అందజేస్తున్నారు.

తంచన్‌గా పింఛన్



కొండాయపాళెం గేటు సెంటర్‌లో ప్రమీలమ్మకు పింఛన్ అందజేస్తున్న వలంటీర్ (ఫైల్)

గత ప్రభుత్వంలో వృద్ధులు, దివ్యాంగులు, వితంతువులు పింఛన్లు పొందాలంటే జన్మభూమి కమిటీ సభ్యుల సిఫార్సులు లేనిదే అందేవి కావు. ఎవరైనా చనిపోతేనే కొత్త వారికి పింఛన్ అందేది. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్ మంజూరు చేస్తున్నారు. వలంటీర్లు ప్రతి నెలా 1వ తేదీ ఉదయాన్నే లబ్ధిదారుల ఇళ్ల వద్దకే వెళ్లి పింఛన్ అందిస్తున్నారు. జిల్లాలో 3 లక్షల మందికి పైగా వైఎస్సార్ పింఛన్ కానుక అందజేస్తున్నారు.

ఆరోగ్య సురక్ష.. ప్రజలకు రక్ష



'ఫ్యామిలీ డాక్టర్'లో భాగంగా వృద్ధురాలికి ఇంటి వద్దే వైద్యం చేస్తున్న సిబ్బంది (ఫైల్)

గత టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగనిర్ధారణ పరీక్షలు జరిగేవి కావు. పేదలు ప్రైవేట్ వైద్యశాలలకు వెళ్లి స్కానింగ్, ఎక్స్‌రేలు తీయించుకోవాల్సి వచ్చేది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమానికి శ్రీకారం చుట్టి ప్రజలకు ఉచితంగా బీపీ, షుగర్, ఈసీజీ తదితర పరీక్షలు ఉచితంగా చేసి అవసరమైన వారికి మందులు కూడా అందిస్తోంది. జిల్లాలోని అన్ని సచివాలయాల పరిధిలో వైద్యశిబిరాలు నిర్వహించి సుమారు 4.5 లక్షల మంది పేదలకు ఉచిత వైద్యసేవలు అందించింది. అలాగే ఆయా వైద్యశిబిరాల్లో మెరుగైన వైద్యం అవసరమైన వారిని గుర్తించి వారికి ఆరోగ్యశ్రీ ద్వారా మెరుగైన చికిత్సలు అందించేలా ఏర్పాట్లు చేసింది. జిల్లాలో ఈ ఏడాది జనవరి 1వ తేదీ నుంచి రెండో విడత 'జగనన్న ఆరోగ్య సురక్ష' క్యాంపులు నిర్వహిస్తూ పేదల ఆరోగ్యానికి భరోసా కల్పిస్తోంది.

'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్ సక్సెస్

గతంలో పల్లె ప్రజలు వ్యాధుల బారిన పడితే పట్టణాలకు పరుగులు తీసేవారు. వేలకు వేలు ఖర్చు చేసినా జబ్బు నయమయ్యే పరిస్థితి లేదు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక 'ఫ్యామిలీ డాక్టర్' కాన్సెప్ట్‌ను ప్రారంభించి వైద్యసిబ్బంది రోగుల ఇళ్లకే వెళ్లి వైద్యసేవలు అందించేలా చర్యలు తీసుకుంది. ప్రతి నెలా రెండ్రోజులపాటు గ్రామ సచివాలయం పరిధిలో 104, సంచార వాహనాల ద్వారా సిబ్బంది వైద్యసేవలు అందిస్తున్నారు.

టీడీపీ హయాంలో స్కీములన్నీ స్కాములే



గత టీడీపీ పాలనలో అనేక స్కీములు స్కాములుగా మారాయి. ఏ పథకం కూడా పేదలకు సక్రమంగా అందేది కాదు. ఆ పార్టీ నేతలు, కార్యకర్తలే ప్రభుత్వ పథకాలను పొందేవారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఆ పరిస్థితి లేదు. ఎవరూ ఊహించని విధంగా సంక్షేమ పథకాలు ప్రజల ఇంటి వద్దకే చేరుస్తున్నారు. – గాజుల ఫారుఖ్‌అలీ, ఉదయగిరి

ప్రతి పథకం పారదర్శకంగా అమలు



రాష్ట్ర ప్రభుత్వం ప్రతి సంక్షేమ పథకాన్ని ప్రజల ఇంటి వద్దకే అందిస్తోంది. ఎలాంటి వ్యయ ప్రయాసలు లేకుండా లబ్ధిదారులు ఇంటి వద్దే తీసుకుంటున్నారు. ప్రభుత్వ పథకాల అమలులో ఎలాంటి అవకతవకలు, అవినీతికి తావులేకుండా అర్హులకే అందజేస్తున్నాం. – ఎం.హరినారాయణన్, కలెక్టర్

బాబు భవిష్యత్‌కు గ్యారెంటీ లేదు



ముసునూరువారిపాళెంలో సచివాలయ భవనాన్ని ప్రారంభించిన మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

- మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి

ముత్తుకూరు: విశేష ప్రజాదరణ కలిగిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎదుర్కొనేందుకు అన్ని పార్టీలతో పొత్తుకు పాకులాడుతున్న టీడీపీ అధినేత చంద్రబాబు భవిష్యత్‌కే గ్యారెంటీ లేదని రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి అన్నారు. ముత్తుకూరు మండలంలోని పైనాపురం, ముసునూరువారిపాళెం పంచాయతీల్లో సోమవారం పలు అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. పైనాపురంలో పలువురు లబ్ధిదారులకు ఇంటి నివేశన స్థలాల పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ 2014 ఎన్నికల్లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఒక్కటి కూడా నెరవేర్చలేదని, 2019 ఎన్నికల సమయంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చిన విషయాన్ని ప్రజలు గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు వస్తున్న తరుణంలో చంద్రబాబు మళ్లీ అబద్ధాలు ప్రచారం చేస్తున్నారని గుర్తుచేశారు. అన్ని సర్వేలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గెలుపును ఖరారు చేస్తున్నాయన్నారు. రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని మళ్లీ ఆశీర్వదించాలని కోరారు.

రూ.4.75 కోట్ల పనులు ప్రారంభం

పైనాపురం పంచాయతీలో రూ.85 లక్షలు, ముసునూరువారిపాళెం పంచాయతీలో రూ.3.90 కోట్ల నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్, సీసీ రోడ్లు, సైడు డ్రెయిన్లు, జల్ జీవన్ మిషన్, సచివాలయ భవనం, ధాన్యం గోదాము తదితర అభివృద్ధి పనులను మంత్రి ప్రారంభించారు. వరుసగా ఐదుసార్లు ఓడిపోయిన టీడీపీ నేత సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి రాబోయే ఎన్నికల్లో టికెట్ వస్తుందన్న గ్యారెంటీ లేదని ఎద్దేవా చేశారు. సర్వేపల్లిలో ప్రజలు మూడోసారి తనను గెలిపించేందుకు సిద్ధంగా ఉన్నారని మంత్రి ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు మెట్ట విష్ణువర్ధన్‌రెడ్డి, ఎంపీపీ గండవరం సుగుణ, జెడ్పీటీసీ సభ్యుడు బందెల వెంకటరమణయ్య, వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ నెల్లూరు శివప్రసాద్, సర్పంచ్‌లు మునుకూరు జనార్దన్‌రెడ్డి, కావలి విజయకుమార్, నాయకులు దువ్వూరు చంద్రశేఖర్‌రెడ్డి, మునుకూరు రవికుమార్‌రెడ్డి, ఈదూరు రామమోహన్‌రెడ్డి, సుధీర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ బిల్లులపై ప్రత్యేక దృష్టి

- ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్



మాట్లాడుతున్న ఎస్ఈ విజయన్

నెల్లూరు(వీఆర్సీసెంటర్): ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న ప్రభుత్వ కార్యాలయాలు, పంచాయతీ విద్యుత్ బిల్లుల వసూళ్లపై అధికారులు, సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించేలా ఆదేశాలు ఇచ్చామని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా సర్కిల్ ఎస్ఈ విజయన్ తెలిపారు. నగరంలోని ఏపీఎస్పీడీసీఎల్ జిల్లా ప్రధాన పరిపాలనా కార్యాలయం విద్యుత్ భవన్‌లో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఎస్ఈ మాట్లాడారు. వేసవిని దృష్టిలో ఉంచుకుని వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సరఫరా చేసేందుకు అవసరమైన అన్ని ప్రాంతాల్లో నూతనంగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. విద్యుత్ వృథాను అరికట్టడాన్ని ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. విద్యుత్‌ను పొదుపుగా వాడడంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. విద్యుత్ సమస్యలపై వచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు.

'ఏ' గ్రేడ్ సాధించిన ఎస్పీడీసీఎల్

విద్యుత్ వినియోగదారులకు సేవలు అందించడంలో ఏపీఎస్పీడీసీఎల్ జాతీయస్థాయిలో 'ఏ'-గ్రేడ్ సాధించిందని ఎస్ఈ తెలిపారు. విశ్వసనీయత, కార్యాచరణ, మీటరింగ్, బిల్లింగ్, వసూళ్లు, రీడింగ్‌లో వచ్చిన తప్పులను సవరించడం, విద్యుత్ సర్వీసులు అందించడం, వచ్చిన ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించడం లాంటి అంశాల్లో జాతీయ స్థాయిలో 'ఏ'-గ్రేడ్ సాధించినట్లు తెలిపారు. అందుకు కృషి చేసిన ప్రతి విద్యుత్ అధికారి, సిబ్బందికి శుభాకాంక్షలు తెలిపారు.

సమస్యల పరిష్కారానికి వేగంగా చర్యలు

- కలెక్టర్ హరినారాయణన్



ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ హరినారాయణన్

నెల్లూరు(దర్గామిట్ట): 'జగనన్నకు చెబుదాం'లో ప్రజలు తమ సమస్యలపై అందించే వినతులకు వేగంగా పరిష్కారం చూపాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ అధికారులను ఆదేశించారు. నెల్లూరులోని కలెక్టరేట్‌లో ఉన్న తిక్కన ప్రాంగణంలో సోమవారం 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం నిర్వహించారు. కలెక్టర్ హరినారాయణన్, ఇన్‌చార్జి డీఆర్వో బాపిరెడ్డి, డీఆర్‌డీఏ పీడీ సాంబశివారెడ్డి, డీపీఓ సుస్మిత ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల నుంచి వస్తున్న సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టి త్వరగా పరిష్కరించాలన్నారు. జిల్లాలో భూ సమస్యలపై సర్వే అధికారులు ప్రత్యేక చొరవ తీసుకుని పరిష్కరించాలన్నారు. నెల్లూరు ప్రభుత్వ వైద్యశాలలో చికిత్స పొందిన రోగులకు అందించే ఆరోగ్య ఆసరా నిధులు దుర్వినియోగంపై సమగ్ర విచారణ జరపాలని బీజేపీ నమామి గంగే రాష్ట్ర కన్వీనర్ మిడతల రమేష్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గృహ నిర్మాణశాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ నాగరాజు, జిల్లా రిజిస్ట్రార్ బాలాంజనేయులు, ఇరిగేషన్ శాఖ ఎస్ఈ కృష్ణమోహన్, ఐసీడీఎస్ పీడీ హేనా సుజన్, డీఎంహెచ్‌ఓ పెంచలయ్య, సోషల్ వెల్ఫేర్, బీసీ, మైనారిటీ, ట్రైబల్ వెల్ఫేర్ అధికారులు రమేష్, వెంకటయ్య, రాజ్యలక్ష్మి, పరిమళ, సమగ్ర శిక్ష ఏపీసీ ఉషారాణి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్



మాట్లాడుతున్న డీఈ మోహన్‌రావు

సైదాపురం: జల్ జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇవ్వాలని డీఈ మోహన్‌రావు తెలిపారు. సైదాపురంలోని ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం జల్ జీవన్ కమిటీతో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈ మాట్లాడుతూ మండలంలోని 13 పంచాయతీల్లో జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా ప్రతి ఇంటికీ తాగునీరు అందించే లక్ష్యంతో కుళాయి కనెక్షన్లు ఇవ్వాలన్నారు. ఆయా పంచాయతీల్లో తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సుధాకర్, ఏపీఎం రాధ తదితరులు పాల్గొన్నారు.

ముందస్తు చర్యలు

వేసవి సమీపిస్తున్న నేపథ్యంలో సైదాపురం మండలంలో తాగునీటి ఎద్దడి లేకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నట్లు ఎంపీడీఓ సుధాకర్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో తాగునీటి సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష

ఒంగోలు: హత్య కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ ఒంగోలులోని 8వ అదనపు జిల్లా జడ్జి డి.అమ్మన్నరాజా సోమవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం ప్రకారం.. కందుకూరు మండలం కోవూరుకు చెందిన ఒక మహిళ భర్తతో విభేదాల కారణంగా గ్రామంలోనే పుట్టింటి వద్ద ఉంటోంది. ఆమెపై కామవాంఛతో గొడపేరు రాజేష్ అనే వ్యక్తి వేధించడం ప్రారంభించాడు. 2021 ఫిబ్రవరి 22న ఆమె ఇంట్లో ఉండగా, రాజేష్ వెళ్లి భౌతికంగా దాడి చేశాడు. ఆమె తల్లి, తండ్రి అడ్డుకోగా, పక్కనే ఉన్న రోకలిబండతో ఆమె తండ్రి పాలేటి చిన్నయేసు తలపై బలంగా కొట్టి తీవ్రంగా గాయపరిచాడు. చిన్న యేసు ఆస్పత్రిలో చికిత్సపొందుతూ మరణించాడు. ఈ ఘటనపై చిన్న యేసు కుమార్తె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కందుకూరు పోలీసులు కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు.

ఈ కేసులో నేరం రుజువు కావడంతో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.1000 జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో ఒక నెల సాధారణ జైలు శిక్ష విధించారు. అంతేకాకుండా ఫిర్యాదిని గాయపరిచినందుకు 3 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 వేల జరిమానా, జరిమానా చెల్లించని పక్షంలో రెండు నెలల సాధారణ జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ తరఫున అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ చావలి రమేష్‌బాబు వాదించగా, లైజన్ ఆఫీసర్‌గా బి.సత్యశ్రీనివాస్, కందుకూరు ఏఎస్సై మన్నం వెంకటేశ్వర్లు, కానిస్టేబుల్ జి.కిషోర్ సహకరించారు.

శిక్షణ కేంద్రంపై ఢిల్లీ బృందం విచారణ



నాక్ శిక్షణా కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఢిల్లీ బృందం

ఉదయగిరి: పట్టణంలో ఏర్పాటు చేసిన ప్రధాన మంత్రి విశ్వకర్మ శిక్షణ కేంద్రాన్ని సోమవారం ఢిల్లీకి చెందిన ప్రభుత్వ బృందం తనిఖీ చేసింది. ఈ శిక్షణా కేంద్రంపై పలు ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో విచారణ చేపట్టారు. చేతివృత్తుల వారి అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం ఈ పథకాన్ని ప్రవేశపెట్టింది. అయితే కొంతమంది నిర్వాహకులు లబ్ధిదారుల నుంచి నగదు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు రావడంతో విచారణ చేస్తున్నామని ఆంధ్రా, తెలంగాణ రీజనల్ డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు తెలిపారు. ఈ శిక్షణా కేంద్రంలో వసతులు, తరగతుల నిర్వహణపై లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ విచారణలో గమనించిన అంశాలను నివేదిక రూపంలో ఉన్నతాధికారులకు అందజేస్తామని చెప్పారు. ఆయనతో పాటు జాయింట్ డైరెక్టర్ విద్యానంద్, డిప్యూటీ డైరెక్టర్ మౌలి, అప్పారావు, ప్రకాష్, తదితరులున్నారు.

కుష్టుపై యుద్ధం

కుష్టు పేరు వినగానే భయపడే రోజులు పోయాయి. దాని నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవడంతో గతంతో పోల్చుకుంటే బాధితుల సంఖ్య బాగా తగ్గింది. మిగిలిన శాతాన్ని కూడా అరికట్టడానికి జిల్లా వైద్యారోగ్య శాఖ సిబ్బంది కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కుష్టు వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు ఇంటింటి సర్వే చేశారు. ఎవరికైనా వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ అయితే మందులు పంపిణీ చేయడం, తగ్గే వరకూ పర్యవేక్షించడం కార్యక్రమాలను పక్కాగా చేస్తున్నారు. తాజాగా జిల్లా వ్యాప్తంగా ప్రజలకు అవగాహన కల్పించారు.

- స్పర్శ కార్యక్రమాన్ని చేపట్టిన ప్రభుత్వం
- నేటితో ముగింపు
- కుష్టు రహిత జిల్లా సాధనే లక్ష్యంగా కార్యక్రమాలు
- గతేడాది సర్వే.. కొత్త రోగులు 32 మంది


స్పర్శ కార్యక్రమం ప్రారంభం సందర్భంగా సూచనలిస్తున్న డీఎంహెచ్‌ఓ పెంచలయ్య (ఫైల్)

నెల్లూరు సిటీ: శరీరంపై మచ్చలుగా మొదలై.. పుండ్లుగా మారి.. సున్నితమైన అవయవాలకు ముప్పు తెచ్చే మహా రోగం కుష్టు (లెప్రసీ) వ్యాధి. ఇది మనకు తెలియకుండానే జరుగుతుంది. ముందుగా గుర్తించి తగిన చికిత్స చేయడం ద్వారా వ్యాధిని నయం చేయవచ్చు. నిర్లక్ష్యం చేస్తే తగిన మూల్యం చెల్లించాల్సిందే. శరీరంలోని నాడీ వ్యవస్థ, ముక్కు, గొంతులోని మృదు కణజాలానికి హాని కలిగిస్తుంది. అదే విధంగా కంటి చూపు దెబ్బ తినే ప్రమాదం ఉంది. బాధితులు స్పర్శను కోల్పోతారు. అందువల్ల గాయాలు తగిలినా నొప్పి తెలీదు. చివరికి రోగి చేతులు, కాళ్లలో వేళ్లు, సున్నితమైన కణజాలానికి నష్టం జరిగి, వైకల్యానికి దారి తీస్తుంది.

'స్పర్శ' ద్వారా..

ప్రస్తుతం కుష్టు వ్యాధి ప్రభావం జిల్లాలో అంతగా లేదు. ఇతర దేశాల్లో మాత్రం అధికంగా ఉంది. ఈ క్రమంలో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచనల మేరకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజల్లో చైతన్యం తీసుకురావడానికి వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాయి. అందులో భాగంగా కుష్టు రహిత జిల్లా సాధన దిశగా అధికార యంత్రాంగం కార్యాచరణ చేపట్టింది. 'స్పర్శ' అనే నినాదంతో సమరం సాగిస్తోంది. కుష్టు అంటు రోగం కాదని, సకాలంలో గుర్తించి ప్రాథమిక దశలోనే మెరుగైన చికిత్స అందిస్తే.. పూర్తి స్థాయిలో అరికట్టే అవకాశముందని వైద్యులు వెల్లడిస్తున్నారు. స్పర్శ అవగాహన కార్యక్రమాలను జనవరి నెల 30వ తేదీన జిల్లా వ్యాప్తంగా ప్రారంభమయ్యాయి. ఇవి మంగళవారంతో ముగుస్తాయి.

చికిత్స ఇలా..

కుష్టు వ్యాధి మైక్రో బాక్టీరియం లెప్రే అనే బాక్టీరియా వల్ల వస్తుంది. ఈ క్రిములు తుమ్మడం, దగ్గడం చేస్తే వ్యాప్తి చెందుతాయి. వ్యాధి లక్షణాలు కనిపించేందుకు 3 నుంచి 5 సంవత్సరాల సమయం పడుతుంది. రోగిగా నిర్ధారించాక రెండు పద్ధతుల్లో వైద్య సేవలందిస్తారు. శరీరంపై మూడు మచ్చలున్న వారికి ఆరునెలల పాటు, ఐదు మచ్చలు పైబడి ఉన్న వారికి మల్టీ బ్యాసిలరీ (ఎంబీ) విధానంలో 12 నెలల పాటు చికిత్స చేస్తారు. రోగులకు నెలకు అవసరమైన మందులను ఒకేసారి నేరుగా వారి ఇళ్ల వద్దనే వైద్య సిబ్బంది అందిస్తారు. సర్వేలో గుర్తించిన రోగులకు సకాలంలో చికిత్స అందించడంతో పాటు ఆ వ్యాధిపై వారికి, వారి కుటుంబ సభ్యులకు అవగాహన కల్పిస్తారు. వ్యాధిని సకాలంలో గుర్తిస్తే మెరుగైన చికిత్సతో నివారించే అవకాశముంది. మల్టీ డ్రగ్ థెరపీతో ఈ వ్యాధిని అరికడుతున్నారు. అన్ని ప్రభుత్వాస్పత్రుల్లో ఈ థెరపీ అందుబాటులో ఉంటుంది.

ఇప్పటికే..

రోగులను గుర్తించి, వారికి సకాలంలో వైద్యసేవలందించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఈ క్రమంలో గతేడాది నవంబర్, డిసెంబర్ నెలల్లో ఇంటింటి సర్వే చేపట్టారు. జిల్లాలో 100 శాతం ఇళ్లల్లో ఈ సర్వే పూర్తి చేశారు. అనుమానితులను గుర్తించి, సమీప ప్రభుత్వాస్పత్రులకు తీసుకెళ్లి కుష్టు నిర్ధారణ పరీక్షలు చేయించారు. 32 మంది రోగులను వైద్యారోగ్య శాఖ కొత్తగా గుర్తించింది. ఇదిలా ఉండగా ఆ శాఖ అధికారుల సిఫార్సు మేరకు కుష్టు వ్యాధిగ్రస్తులకు ప్రభుత్వం ప్రతి నెలా పింఛన్ ఇస్తోంది.

విస్తృతంగా అవగాహన



జిల్లాను కుష్టు రహితంగా మార్చేందుకు వైద్యారోగ్య శాఖ కృషి చేస్తోంది. గ్రామాల్లో పెద్ద ఎత్తున అవగాహన కార్యక్రమాలు జరుగుతున్నాయి. పాఠశాలలు, పీహెచ్‌సీలు, ఆరోగ్య కేంద్రాల్లో చేపట్టాం. మా సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. వ్యాధి ఇతరులకు వ్యాప్తి చెందకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరిస్తున్నారు.

– ఎస్‌కే ఖాదర్‌వలీ, జిల్లా లెప్రసీ, ఎయిడ్స్, టీబీ కంట్రోల్ అధికారి

హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి

నెల్లూరు(క్రైమ్): మద్యం మత్తులో ఓ వ్యక్తి హెడ్‌కానిస్టేబుల్‌పై దాడి చేసిన ఘటన నెల్లూరులో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. కోవూరుకు చెందిన రవి మర్రిపాడు పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. ఆయన ఆదివారం నెల్లూరుకు వచ్చాడు. పని ముగించుకుని రాత్రి ఆటో కోసం ఆత్మకూరు బస్టాండ్ వద్ద వేచిచూడసాగాడు. ఈ క్రమంలో రామకోటయ్యనగర్‌కు చెందిన రెహమాన్ మద్యం తాగి ఆటో డ్రైవర్లతో దురుసుగా ప్రవర్తించసాగాడు. ఈ విషయాన్ని గమనించిన రవి ఎందుకు అలా చేస్తున్నావని రెహమాన్‌ను ప్రశ్నించాడు. దీంతో కోపోద్రిక్తుడైన అతను రవిపై దాడి చేశాడు. బాధిత హెడ్‌కానిస్టేబుల్ సోమవారం నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసాలకు పాల్పడుతున్నారు.. జాగ్రత్త

- ఎస్పీ డాక్టర్ తిరుమలేశ్వరరెడ్డి సూచన

నెల్లూరు(క్రైమ్): 'గ్రామీణ ప్రాంతాల్లో అనారోగ్యంతో ఉన్నవారిని లక్ష్యంగా చేసుకుని అపరిచిత వ్యక్తులు మోసాలకు పాల్పడుతున్నారు. అలాంటి వారిపట్ల అప్రమత్తంగా ఉండాలి' అని ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి సూచించారు. నెల్లూరులోని ఉమేష్‌చంద్ర కాన్ఫరెన్స్ హాల్లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం జరిగింది. అత్తింటి వేధింపులు, ఆస్తి వివాదాలు, అనధికార చిట్స్, ప్రేమ, ఉద్యోగాల పేరిట మోసాలు తదితర సమస్యలపై జిల్లా వ్యాప్తంగా 112 మంది ఎస్పీకి ఫిర్యాదు చేశారు. వాటిని పరిశీలించిన ఆయన సంబంధిత పోలీసు అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. చట్టపరిధిలో నిర్ణీత గడువులోగా సమస్యలను పరిష్కరించి బాధితులకు న్యాయం జరిగేలా చూడాలని ఆదేశించారు. స్పందన ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవన్నారు. వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఫిర్యాదులపై తక్షణమే స్పందించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రేమపేరిట వంచనకు పాల్పడే వారిపై కఠినంగా వ్యవహరించాలన్నారు. కార్యక్రమంలో ఏఎస్పీలు సౌజన్య, ప్రసాద్, నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, ఎస్బీ ఇన్‌స్పెక్టర్లు రామకృష్ణారెడ్డి, షఫీ తదితరులు పాల్గొన్నారు.


బాధితురాలి సమస్య వింటున్న ఎస్పీ

విద్యుత్ షాక్‌కు గురై.. కింద పడి..

- హరనాథపురంలో వ్యక్తి మృతి

నెల్లూరు(క్రైమ్): పెయింట్ పనులు చేసేందుకు కర్రలు కడుతుండగా ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై కిందపడి బేల్దారి కూలి మృతిచెందాడు. ఈ ఘటన నెల్లూరు హరనాథపురంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. శ్రీకాకుళానికి చెందిన లక్ష్మీనారాయణ (52), లక్ష్మి దంపతులు 18 ఏళ్ల క్రితం ఉపాధి నిమిత్తం నెల్లూరుకు వచ్చారు. ఉమ్మారెడ్డిగుంటలో ఉంటూ బేల్దారి పనులు చేస్తున్నారు. సోమవారం లక్ష్మీనారాయణ హరనాథపురంలో ఓ ఇంటికి పెయింట్ వేసేందుకు కర్రలు కట్టేందుకు వెళ్లాడు. రెండో అంతస్తులో పని చేస్తుండగా విద్యుత్ వైర్లకు తగిలి షాక్‌కు గురై పైనుంచి కిందపడి తలకు తీవ్రగాయమై మృతిచెందాడు. బాధితురాలు లక్ష్మి బాలాజీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఏఎస్సై శ్రీనివాసరాజు కేసు నమోదు చేసి మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు.

నిమ్మ ధరలు (కిలో)



పెద్దవి	రూ.63
సన్నవి	రూ.50
పండ్లు	రూ.25

పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు

బ్రాయిలర్ (లైవ్)	143
లేయర్ (లైవ్)	85
బ్రాయిలర్ చికెన్	252
బ్రాయిలర్ స్కిన్‌లెస్	280
లేయర్ చికెన్	145